# ఆదమరిస్తే.. అంతే..!

- జాతీయ రహదారిపై ప్రమాదకరంగా కల్వర్టు
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిపై రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మెట్‌పల్లి, మే 29: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో 63వ జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టుకు ఓ వైపు గోడ పూర్తిగా కూలిపోయింది. ఇక్కడ వాహన చోదకులు ఆదమరిచి డ్రైవింగ్ చేస్తే ప్రమాదానికి గురవుతారు. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వెళ్లేందుకు జాతీయ రహదారిలో కాలువపై దశాబ్ధాల కిందట కల్వర్టు నిర్మించి, ఇరువైపులా రక్షణ గోడలు కట్టారు. కాలక్రమేనా అవి శిథిలావస్థకు చేరగా ఓ వైపు గోడ పూర్తిగా కుప్పకూలింది. రెండేళ్ల కిందట రాత్రి పూట సామగ్రి లోడ్‌తో వెళ్తున్న లారీ కల్వర్టుపై నుంచి కాలువలో బోల్తా పడింది. కొంత కాలం తర్వాత జాతీయ రహదారి విభాగం అధికారులు తాత్కాలికంగా గోడను నిర్మించారు. ఇప్పుడు ఆ గోడ పూర్తిగా కూలిపోవడంతో మళ్లీ ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ ఏ మాత్రం ఆదమరిచి డ్రైవింగ్ చేసినా ప్రమాదానికి గురి కావాల్సిందే. సంబంధిత జాతీయ రహదారి అథార్టీ అధికారులు స్పందించి కల్వర్టును విస్తరించి రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

# అసంపూర్తిగా పాఠశాల భవనం



అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణ పనులు

కోరుట్ల, మే 29: కోరుట్ల పట్టణంలోని కల్లూర్ రోడ్డులో గల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు భవన నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 1.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో జీప్లస్ వన్ పద్ధతిలో అయిదు తరగతి గదులు, డైనింగ్ హాల్, మూత్రశాలలు నిర్మించేందుకు గుత్తేదారుకు పనులు అప్పగించింది. రెండు స్లాబులు పోసిన కాంట్రాక్టర్ బిల్లులు రాకపోవడంతో ఏడాదిన్నర క్రితం పనులను మధ్యలోనే వదిలేశాడు. దీంతో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయి చుట్టుపక్కల వారికి వాహనాల పార్కింగ్ స్థలంగా మారింది. కాగా, పాఠశాలలో తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియంలో మొత్తం 15 తరగతులకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులను వరండాలో, చెట్ల కింద కూర్చోబెట్టి చదువు చెప్పాల్సి వస్తున్నదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కోరుట్ల, మే 29: కోరుట్ల ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండుల్లో ఖాళీగా ఉన్న షాపుల అద్దె కోసం టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరుట్ల బస్టాండ్‌లో 5, కథలాపూర్‌లో 2, మేడిపల్లిలో ఒకటి ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. డిపో మేనేజర్ కార్యాలయంలో టెండర్ ఫారాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వివరాలకు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## అత్తగారింటికి వచ్చిన అల్లుడి అదృశ్యం

మెట్‌పల్లి రూరల్, మే 29: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేటలో అత్తగారింటికి బుధవారం వచ్చిన మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన ఎర్ర గణేశ్ (35) అదృశ్యమైనట్లు స్థానికులు తెలిపారు. గణేశ్ బుధవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో బంధువులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. గణేశ్ సోదరుడు మెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలిస్తున్నారు.

# మానసిక వేదనతోనే పంచాయతీ కార్యదర్శి మృతి



మాట్లాడుతున్న బలరాం

జగిత్యాల, మే 29: మంచిర్యాల జిల్లా ఇందన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎర్రోజు చంద్రమౌళి పని ఒత్తిడి, మానసిక వేదన, ఆర్థిక ఇబ్బందులతో గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బలరాం ఆరోపించారు. కాగా, జగిత్యాలకు చెందిన చంద్రమౌళి బుధవారం గుండెపోటుతో మృతి చెందగా, గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు, టీఎన్జీవో, టీజీవో, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు హాజరై బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ, రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు రాత్రనకా, పగలనకా కష్టపడుతూ గ్రామాల్లో పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాకపోయినా గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్య పనులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని సర్కార్ నుంచి ఒత్తిడి వస్తుండడంతో సొంతంగా డబ్బులు ఖర్చు చేసి బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాంట్ ఉన్నప్పటికీ ఆ బిల్లులు మంజూరు కాక, పంచాయతీ కార్యదర్శులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గుండెపోటుతో మృతి చెందిన చంద్రమౌళికి ప్రభుత్వం నుంచి దాదాపు నాలుగు లక్షల బిల్లులు రావాల్సి ఉందని, ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు అధికారులు, యూనియన్ నాయకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో చాలా రోజులుగా మానసిక వేదన అనుభవిస్తున్నాడన్నారు. ఓవైపు పని ఒత్తిడి, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదనతో చంద్రమౌళి మృతి చెందాడన్నారు. చంద్రమౌళి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పూదరి నరేందర్, బాబురావు, శ్రవణ్ కుమార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, టీఎన్జీవో జగిత్యాల అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు రామ్‌కిషన్ రావు, నయీమ్, సిద్దిపేట జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మురళి, సంతోష్, నాయకులు శ్రీనివాస్ నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో కత్తిపోట్ల కలకలం

- పరస్పరం కత్తులతో దాడి చేసుకున్న తండ్రీకొడుకులు
- కొడుకు పరిస్థితి విషమం.. తండ్రికి స్వల్ప గాయాలు

కోరుట్ల, మే 29: ఆస్తి పంపకాల విషయంలో తండ్రీకొడుకు మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసిన ఘటన కోరుట్లలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వివేకానంద రోడ్డు కాలనీకి చెందిన రాచకొండ దేవ భూమయ్యకు చిన్న కుమారుడు నవీన్‌తో ఆస్తి పంపకాల విషయంలో కొద్ది నెలలుగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆస్తిలో తనకు రావాల్సిన వాటాను పంచి ఇవ్వాలని నవీన్ తండ్రితో ఇంటి వద్ద గురువారం గొడవకు దిగాడు. తండ్రి ససేమిరా అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చిలికి చిలికి గాలివానలా మారి కత్తిపోట్లకు దారి తీసింది. కోపోద్రిక్తులైన తండ్రీకొడుకులు ఆవేశంలో పరస్పరం కత్తులతో దాడికి తెగబడ్డారు. కుమారుడికి తీవ్ర గాయాలు కాగా, తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు ఇద్దరిని స్థానిక ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. నవీన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలించారు.

## తనయుడి చేతిలో తండ్రి హతం

మేడిపల్లి, మే 29: క్షణికావేశంలో తండ్రిని కొడుకు చంపిన ఘటన మేడిపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన అంగడి నర్సయ్య (55) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. భూమి విషయంలో భార్య, కొడుకు వెంకటేశ్‌తో గొడవ పడ్డాడు. అలాగే, తరచూ తాగి వచ్చి భార్యను తిడుతుండేవాడు. కాగా, గురువారం మధ్యాహ్నం భార్యను తిడుతుండడంతో కోపోద్రిక్తుడైన కొడుకు వెంకటేశ్ పక్కనే ఉన్న సెంట్రింగ్ రాడ్‌తో నర్సయ్య తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్ఐ మిట్టపల్లి సుప్రియ ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నర్సయ్య తమ్ముడు రాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుప్రియ కేసు నమోదు చేయగా, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు.



లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందజేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

# 600 చదరపు ఫీట్లు మించవద్దు

- ప్రొసీడింగ్ పత్రాలు అందుకున్నవారు 45 రోజుల్లో పనులు ప్రారంభించాలి
- కలెక్టర్ సత్యప్రసాద్
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేత

మల్యాల, మే 29: ఇందిరమ్మ లబ్ధిదారులు 600 చదరపు ఫీట్లు మించకుండా ఇంటి నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి 303 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, మండలంలో మొదటి విడుతలో సర్వాపూర్‌ను పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి 106 మందికి ఇండ్లు మంజూరు చేయగా 50 మంది పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 35 మందికి రూ. లక్ష చొప్పున బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేసినట్లు చెప్పారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు 45 రోజుల్లోగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యేక యాప్‌లో కార్యదర్శి, ఇంజినీర్ పొందపరచడం ద్వారా లబ్ధిదారు ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటి వరకు మండలంలో 400పై చిలుకు ఇండ్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ కోట వసంత, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మల్లీశ్వరీ–శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్లు రాంలింగారెడ్డి, చంద్రశేఖర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో గౌతం రెడ్డి

మల్లాపూర్, మే 29: రానున్న వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈవో గౌతం రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, వైద్య శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో గౌతం రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, మండల వైద్యాధికారి వాహిని రావు, మండల పంచాయతీ అధికారి జగదీశ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

మారుతీనగర్, మే 29: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ శివ భక్తమార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి గుంటుక సదాశివ్ దంపతులు రూ. 25,116 పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ద్యావనపెల్లి రాజారాం, ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు సంకు ఆనంద్, కోశాధికారి భాస్కర్, కార్యదర్శులు సత్యనారాయణ, ప్రసాద్, గణేశ్, హన్మాండ్లు, గుంటుక మహేశ్, చిన్నయ్య, నరేశ్, కార్యవర్గ సభ్యులు రాఘవులు, శ్రీనివాస్, రవి, గంగాధర్, ద్విజేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల చట్టాలపై అవగాహన

కోరుట్ల, మే 29: వయోవృద్ధులకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో గురువారం వయోధికుల రక్షణ, పోషణ, సంక్షేమ చట్టంపై వయోధికులు, వివిధ సంఘాల ప్రతినిధులకు ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ, వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రకాశ్‌రావు, హన్మంతు రెడ్డి, శివానందం, రాజ్ మోహన్, గంగారాం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

సారంగాపూర్, మే 28: వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీర్‌పూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బోగ శ్రావణి మాట్లాడుతూ, కొనుగోళ్లలో జాప్యంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

## ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

పెగడపల్లి, మే 29: పెగడపల్లి మండలం నందగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లు గురువారంతో ముగిసినట్లు సంఘం చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి సంకిటి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు నాలుగు కొనుగోలు కేంద్రాల ద్వారా 609 మంది రైతుల నుంచి 34566 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. నందగిరి కొనుగోలు కేంద్రంలో 8630 క్వింటాళ్లు, ఐతుపల్లిలో 11162, నామాపూర్‌లో 7676, మ్యాకవెంకయ్యపల్లిలో 7096 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. 95 శాతం మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అయినట్లు తెలిపారు.

## మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం బాధాకరం

మెట్‌పల్లి, మే 29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో మున్నూరుకాపు కులస్తులకు చోటు కల్పించకపోవడం బాధాకరమని జిల్లా మున్నూరుకాపు యువజన నాయకులు పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు యువత విభాగం జిల్లా అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్, జిల్లా మున్నూరుకాపు యువజన నాయకులు బూరుగు గంగారెడ్డి పటేల్, బొడ్ల రాజేందర్, జెట్టి రూపేశ్‌రాజు పటేల్, బొడ్ల రాహూల్, వొల్లాడపు లింబాద్రి, గణేశ్ పాల్గొన్నారు.

## 'రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ'

జగిత్యాల, మే 29: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పంట రుణ మాఫీ చేయాలని కనీసం ఆలోచన కూడా చేయకపోవడం, కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు కనీసం రూ. 500 పెంచాల్సి ఉండగా కేవలం రూ.69 పెంచినట్లు తెలిపారు.

## గుంతలు పూడ్చివేసిన పోలీసులు

మెట్‌పల్లి, మే 29: మెట్‌పల్లి పట్టణంలో గురువారం పోలీసులు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను సిమెంట్‌తో పూడ్చివేయించారు. ఎస్పీ ఆదేశాలతో సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరపేట నుంచి మెట్‌పల్లి ఆర్టీసీ డిపో వరకు జాతీయ రహదారి పొడవున ప్రమాదకరంగా ఉన్న గుంతలను దగ్గరుండి పూడ్చి వేయించారు.



రహదారిపై గుంతలో సిమెంట్ మిశ్రమం పోయిస్తున్న పోలీసులు

## మొక్కలను సిద్ధం చేయాలి



నర్సరీలో మొక్కల వివరాలు తెలుసుకుంటున్న ఏపీవో

కథలాపూర్, మే 29: వన మహోత్సవం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఉపాధిహామీ ఏపీవో రాజేందర్ సూచించారు. కథలాపూర్ మండలం చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో వన నర్సరీలను గురువారం ఆయన పరిశీలించారు. మొక్కలు ఎన్ని ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే గ్రామాల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉపాధిహామీ సిబ్బంది, కూలీలకు ఆయన పలు సూచనలిచ్చారు.

## ఇండ్ల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలి



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, మే 29: ప్రణాళిక ప్రకారం చట్టబద్ధ అనుమతులతో ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. జగిత్యాలలోని 7, 8వ వార్డుల్లో రూ.25 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మాజీ చైర్మన్లు అడువాల జ్యోతి–లక్ష్మణ్, గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్లు మల్లవ్వ, రేణుక, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్, డీఈ నాగేశ్వర్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు సత్కారం

కోరుట్ల రూరల్, మే 29: కోరుట్ల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణచైతన్యను గురువారం మీ సేవ నిర్వాహకులు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు పెద్ది గంగారెడ్డి, మనోహర్, రాజేశ్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

## అంజన్న ముడుపుల ఆదాయం @ 1.65 లక్షలు

మల్యాల, మే 29: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాల నేపథ్యంలో దీక్షాపరులు సమర్పించిన ఇరుముడులను విప్పి లెక్కించగా నగదు రూపంలో రూ. 1,65,641 వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీకాంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకుడు రాజమౌళి, పర్యవేక్షకులు సునీల్‌కుమార్, చంద్రశేఖర్, హరిహరనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, కూరగాయల రాములు, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, ఏఎస్ఐ రమణారెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

మేడిపల్లి, మే 29: భీమారం మండల కేంద్రంతోపాటు మండలంలోని కమ్మరిపేట, మన్నెగూడెం గ్రామాల్లో గురువారం ఆయిల్ పామ్ సాగుపై లోహియా ఎడిబుల్ కంపెనీ మేనేజర్ విజయ్ భరత్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సురేందర్‌నాయక్, ఆయిల్ పామ్ విస్తరణాధికారి అన్వేష్, ఉదయశ్రీ, రమణ, సంజీవ్, రైతులు పాల్గొన్నారు.

## ఆర్మీ జవాన్‌కు సత్కారం

ఇబ్రహీంపట్నం, మే 29: ఇబ్రహీంపట్నం మండలం కోజన్‌కొత్తూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ తోట రమేశ్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని సెలవుపై ఇంటికి వచ్చాడు. కాగా, రమేశ్‌ను గురువారం పదో తరగతి మిత్రులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, రాజేంద్రప్రసాద్, వెంకటరాజశేఖర్, రఘువీర్ పాల్గొన్నారు.

## అక్రమంగా గోవులను తరలిస్తే చర్యలు



పశువులను తరలిస్తున్న వాహనాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారి మనీషా, పోలీసులు

మెట్‌పల్లి రూరల్, మే 29: గోవులను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి మనీషా హెచ్చరించారు. మండలంలోని గండిహనుమాన్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ, గోవులను అక్రమంగా రవాణా చేసే వాహనాలను పోలీసులు పట్టుకుంటే సంబంధిత గోవులను రిజిష్టర్ అయిన గోశాలకు సురక్షితంగా తరలించాలని, అలాగే రవాణా చేస్తున్న వారితో పాటు అమ్మిన వారు, కొన్నవారిపై కేసు నమోదు చేయాలని సూచించారు. పశువుల క్రయ, విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడికి పరామర్శ



హరిచరణ్‌రావును పరామర్శిస్తున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మేడిపల్లి, మే 29: భీమారం మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు తండ్రి సురేందర్‌రావు ఇటీవల మృతి చెందాడు. హరిచరణ్‌రావును గురువారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ప్రజాప్రతినిధులు మోర హన్మాండ్లు, రామ్మోహన్‌రావు, అయిల్నేని సాగర్‌రావు, ప్రశాంత్, కృష్ణారావు, తిరుపతి రెడ్డి, మకిలి దాస్, రాజ్‌కుమార్ పరామర్శించారు.

## కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

మేడిపల్లి, మే 29: భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి వెల్మి మానాల వెంకటేశ్ రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేస్తుండగా వైద్యానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నెల 28న 'నమస్తే తెలంగాణ'లో 'ఆపన్న హస్తం కోసం ఎదురు చూపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జీర్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనందకుమార్ గురువారం వెంకటేశ్‌కు రూ. 5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉరుమడ్ల లక్ష్మణ్, ఉమ్మడి రవి, గంట గంగరాజు, నర్సింగరావు, దుంపల మనోజ్, ఉత్కం అజయ్, విలేశ్, అజయ్, చెక్కపెల్లి శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్‌కు నగదు అందజేస్తున్న ఆనంద్‌కుమార్


## దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మెట్‌పల్లి రూరల్, మే 29: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు అందుతున్న సేవలు, ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. మందుల స్టోర్ రూమ్‌ను పరిశీలించి స్టాక్ వివరాలు, రికార్డులను తనిఖీ చేశారు. ల్యాబ్‌ను పరిశీలించి టీ హబ్‌కు పంపుతున్న శాంపిళ్లు, క్షయ సంబంధిత కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, సాధారణ ప్రసవాలతో ప్రయోజనాలను గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు ప్రసవం కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను బలోపేతం చేయాలి



జాతీయ జెండాతో ఎమ్మెల్సీ కొమురయ్య, ఉపాధ్యాయులు

జగిత్యాల, మే 29: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేసి, బలోపేతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపాధ్యాయులకు ఇస్తున్న వృత్యంతర శిక్షణను వినియోగించుకొని బోధన అభ్యాసన సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు తమవంతుగా ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చేలా చూడాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ, జిల్లాలో సమర్థవంతంగా పాఠశాలల్లో బోధన నడుస్తున్నదని, మరింత మెరుగు పరుచుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కొమురయ్యకు జిల్లా విద్యాశాఖ తరఫున స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు భారత సైన్యానికి అభినందనలు తెలుపుతూ చేపట్టిన ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ, రాజేశ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాదరావు, అయిల్నేని నరేందర్ రావు, ఒడ్నాల రాజశేఖర్, స్వామి, శంకర్, స్వామి, సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### టీచర్స్ భవన్‌కు నిధులు కేటాయించాలి

జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌కు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్సీ మల్కా కొమురయ్యకు తపస్ జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాదరావు, రాష్ట్ర బాధ్యులు అయిల్నేని నరేందర్ రావు, ఒడ్నాల రాజశేఖర్, లింబగిరి స్వామి, తీగల శ్రీనివాస్, కందుకూరి రాజేశ్వర్, శ్రీనివాసరావు, రమేశ్, మల్హర్ రావు, సాయిని శ్రీనివాస్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనుల పరిశీలన




పనుల కొలతలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి

సారంగాపూర్, మే 29: మండలంలోని లక్ష్మీదేవిపల్లి, పెంబట్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం జిల్లా విజిలెన్స్ అధికారి, మండల కో–ఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి పరిశీలించారు. కూలీలకు కూలి రూ. 307 వచ్చేలా పనులు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీలత, టీఏ స్వప్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 29: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామి వారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## ప్రమాదకరంగా వ్యవసాయ బావులు



రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి

కోరుట్ల రూరల్, మే 29: మండలంలోని ఐలాపూర్ నుంచి యూసుఫ్‌నగర్ వెళ్లే రహదారిని ఆనుకొని ఇరువైపులా వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల రహదారిని రెండు వరుసలుగా విస్తరించడంతో వ్యవసాయ బావులు రహదారి పక్కనే ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వ్యవసాయ బావుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

మల్లాపూర్, మే 29: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్‌గా రమేశ్ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.